యూపీఏకి ముప్పేమీ లేదు

● కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ

న్యూఢిల్లీ : యూపీఏ ప్రభుత్వ స్థిరత్వానికి ముప్పేమీ లేదని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ధీమా వ్యక్తం చేశారు. మాజీ కూటమి పార్టీలైన ఎస్పీ, ఆర్జేడీలు మహిళా రిజర్వేషన్ బిల్లుపై మద్దతు తెలుపుతాయనే అనుకుంటున్నానని అన్నారు. అయితే ఈ విషయంపై ఎవరూ ఏమీ చెప్పలేరని, తాను జోతిష్కురాలిని కాదని అన్నారు. యూపీఏ మాజీ భాగస్వాములు తమతో కలిసి ఉండాలని ఆమె కోరారు. మహిళా బిల్లు అమలు చేస్తే యూపీఏ కూటమి నుంచి వైదొలుగుతామని ఎస్పీ, ఆర్జేడీలు హెచ్చరించిన నేపథ్యంలో దీనిపై ఆందోళన చెందనవసరం లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. యూపీఏ కూటమిలో ఎటువంటి సమస్యలు లేవని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తృణముల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీ మహిళా బిల్లు అమలు చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారని, డీఎంకే కూడా ప్రధానికి పూర్తి మద్దతిస్తున్నట్లు ప్రకటించిందని ఆమె వెల్లడించారు. అదేవిధంగా పవార్ కూడా పూర్తి మద్దతునిచ్చారని, ప్రతి ఒక్కరూ మహిళా బిల్లుకు సహకరిస్తున్నారని ఆమె తెలిపారు. యూపీఏ కూటమిలో ఎటువంటి సమస్యలూ లేవని ఆమె పేర్కొన్నారు.

బిల్లుకు మద్దతివ్వాలని లాలూను కోరాను : సోనియా

బిల్లుకు మద్దతివ్వమని ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్‌ని కోరానని సోనియాగాంధీ అన్నారు. ఆయనకు ఏడుగురు కుమార్తెలు ఉన్నారని, బిల్లుకు మద్దతిస్తే వారూ రిజర్వేషన్ పొందుతారని లాలూకు చెప్పానని సోనియా గుర్తు చేశారు. దీనికి సమాధానంగా లాలూ నవ్వారని చెప్పారు. లాలూ, ఎస్పీ అధ్యక్షుడు ములాయం సింగ్ యాదవ్‌లతో సోనియా ఇష్టాగోష్టి గురించి విలేకరులు ప్రశ్నించగా ఆమె పైవిధంగా చెప్పారు. బిల్లుపై మాజీ భాగస్తులు ఇప్పటికీ తమతోనే ఉన్నారని సోనియా విశ్వాసం వ్యక్తం చేశారు.

లోక్ సభలో పార్టీల బలాబలాలు

బిల్లుకు అనుకూలం		వ్యతిరేకం	
యూపీఏ కూటమి	260	సమాజ్‌వాది పార్టీ	21
కాంగ్రెస్	208	బహుజన సమాజ్‌పార్టీ	21
తృణమూల్ కాంగ్రెస్	19	జనతాదళ్ (యునైటెడ్)	20
డీఎంకె	18	రాష్ట్రీయ లోక్‌దళ్	5
నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ	9	రాష్ట్రీయ జనతాదళ్	4
నేషనల్ కాన్ఫరెన్స్	3	జనతాదళ్ (సెక్యులర్)	3
ముస్లింలీగ్	2	జార్ఖండ్ ముక్తిమోర్చ	2
వీసీకేకే	1	ఇతరులు	3
మొత్తం	79		
ఇతర పక్షాలు	198		
భారతీయ జనతాపార్టీ	116	ఎటూ తేల్చనివి	
ఇండిపెండెంట్లు	10	తెలంగాణ రాష్ట్ర సమితి	2
వామపక్షాలలు	24	బహుజన్ వికాస్ అగాధి	1
బిజు జనతాదళ్	14	బోడోలాండ్ పీపుల్స్‌ఫ్రంట్	1
అన్నా డిఎంకె	9	హర్యానా జనహిత కాంగ్రెస్	1
శివసేన	11	కేరళ కాంగ్రెస్ (ఎం)	1
తెలుగుదేశం	6	స్వాభిమాని పక్ష	1
శిరోమణి అకాలీదళ్	4	మొత్తం	7
ఇతరులు	4		
మొత్తం	458		

రాజ్యసభలో పార్టీల బలాబలాలు

పార్టీ	సభ్యులు
కాంగ్రెస్	71
భారతీయ జనతాపార్టీ	45
సీపీఎం	15
సమాజ్‌వాది పార్టీ	12
బహుజన్ సమాజ్ పార్టీ	12
అన్నా డీఎంకే	7
ఇండిపెండెంట్లు, ఇతరులు	7
జనతాదళ్ (యూ)	7
నేషనలిస్ట్ కాంగ్రెస్	6
డీఎంకే	4
రాష్ట్రీయ జనతాదళ్	4
శివసేన	4
శిరోమణి అకాలీదళ్	3
తెలుగుదేశం	2
అసోం గణపరిషత్	2
తృణమూల్ కాంగ్రెస్	2
నేషనల్ కాన్ఫరెన్స్	2
జనతాదళ్ (సెక్యులర్)	2
లోక్ జనశక్తి పార్టీ	1
ముస్లింలీగ్	1
మిజో నేషనల్‌ఫ్రంట్	1
ఫార్వర్డ్ బ్లాక్	1
బోడోలాండ్ పీపుల్స్‌పార్టీ	1
స్వతంత్ర భారత్ పక్ష	1
సిక్కిం డెమోక్రాటిక్ ఫ్రంట్	1
రాష్ట్రీయ లోక్‌దళ్	1
రివల్యూషనరీ సోషలిస్ట్‌పార్టీ	1
నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్	1
పట్టాలి మక్కళ్ కచ్చి	1
ప్రస్తుత సభ్యులు	233
భర్తీ కావలసిన స్థానాలు	12
మొత్తం స్థానాలు	245

కోల్‌కతాలో బసంత్ ఉత్సవ్ వేడుకల సందర్భంగా రవీంద్రభారతి విశ్వవిద్యాలయంలో నృత్య ప్రదర్శనను చేస్తున్న విద్యార్థులు

బిల్లుకు మోక్షం దొరికిందిలా...

● దేశంలో మహిళా స్థానంపై 1974లో కమిటీ ఏర్పాటు
● 1992లో స్థానిక సంస్థల్లో 33శాతం రిజర్వేషన్లు

న్యూఢిల్లీ :ఎన్నో ఏళ్లుగా అనేక అవాంతరాల్ని ఎదుర్కొన్న మహిళాబిల్లు మంగళవారం రాజ్యసభలో ఎట్టకేలకు నెగ్గింది. చట్టపరంగా మొదటి ఆటంకాన్ని అధిగమించింది. బిల్లుపై చర్చ జరిగినప్పుడల్లా గతంలో తీవ్ర వాదోపవాదాలు, కొన్ని సందర్భాల్లో బలప్రదర్శనలు జరిగాయి. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఇప్పటిది కాదు.

1974లోనే సిఫార్సు

భారతదేశంలో మహిళ స్థానం అనే అంశంపై ఓ కమిటీ 1974లో విద్య, సాంఘిక సంక్షేమ మంత్రిత్వశాఖకు సమర్పించిన నివేదికలో పార్లమెంటులో మహిళాప్రాతినిధ్యాన్ని మొదటిసారి ప్రస్తావించారు. రాజకీయ పార్టీల్లో మహిళల సంఖ్య తక్కువగా ఉందని, పంచాయతీలు, మున్సిపాలిటీల్లో వారికి స్థానాలు కేటాయించాలని ఆనాటి కమిటీ సిఫార్సు చేసింది. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మూడింట ఒక వంతు స్థానాల్ని మహిళలకు కేటాయించాలని 1993లో 73,74 రాజ్యాంగ సవరణలు చేశారు. ఆ తర్వాత, 1992 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారు. పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు స్థానాలు కేటాయించాలన్న ఆలోచన రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే వచ్చింది.

1996లో మొదటిసారి పార్లమెంటులో మహిళాబిల్లును ప్రవేశపెట్టారు. అప్పటినుంచీ బిల్లు ఆమోదానికి ప్రభుత్వాలు ఎన్నో విఫలయత్నాలు చేశాయి.

1996లో మహిళాబిల్లును ప్రవేశపెట్టింది మొదలు ఇప్పటివరకు జరిగిన సంఘటనల కాలక్రమం

●1996 సెప్టెంబర్ 12: దేవెగౌడ ప్రధానిగా ఉన్నప్పుడు అప్పటి న్యాయశాఖమంత్రి రమాకాంత్ డి. ఖాలప్ లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ లోక్‌సభలో బిల్లు (81వ రాజ్యాంగ సవరణ బిల్లు)ను ప్రవేశపెట్టారు. ఆ మర్నాడు అంటే సెప్టెంబర్ 13న 230 మంది మాత్రమే లోక్‌సభకు హాజరయ్యారు. ఏదైనా రాజ్యాంగ సవరణ సభ ఆమోదం పొందాలంటే, 273 మంది సభ్యులు సమర్థించాలి. బిల్లు ఆమోదానికి తగిన సంఖ్యాబలం లేకపోవడంతో గీతాముఖర్జీ సారథ్యంలోని పార్లమెంటరీ సంయుక్త కమిటీకి పంపారు. ఆ తర్వాత, మైనారిటీలో ఉన్న దేవెగౌడ ప్రభుత్వం పడిపోయి, లోక్‌సభ రద్దయింది.

● 1996 డిసెంబర్ 9: పార్లమెంటరీ సంయుక్త కమిటీ లోక్‌సభకు నివేదిక సమర్పించింది.

● 1997 జూన్: శరద్‌యాదవ్ బిల్లును వ్యతిరేకించారు. 'పొట్టి జుట్టున్న ఈ మహిళలు స్త్రీలకోసం మాట్లాడతారా?' అని ఎగతాళి చేశారు.

●26 జూన్ 1998: అటల్ బిహారీ వాజ్‌పేయి సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 12వ లోక్‌సభలో మళ్లీ మహిళాబిల్లును ప్రవేశపెట్టారు. అప్పుడది 84వ రాజ్యాంగ సవరణ బిల్లుగా మారింది. న్యాయశాఖమంత్రి ఎం. తంబుదురై బిల్లును ప్రతిపాదించారు. రాష్ట్రీయ జనతాదళ్ సభ్యుడు సురేంద్రప్రసాద్ యాదవ్ సభా మధ్యానికి వచ్చి స్పీకర్ జీఎంసీ బాలయోగి చేతుల్లోంచి బిల్లు ప్రతిని లాక్కొని ముక్కలు ముక్కలుగా చించేశారు.

●1999 : ఎన్డీఏ ప్రభుత్వం 13వ లోక్‌సభలో తిరిగి మహిళా బిల్లును ప్రవేశపెట్టింది.

●2002: పార్లమెంటులో మళ్లీ బిల్లు ప్రవేశపెట్టారు. బిల్లు చర్చకు వస్తే సమర్థిస్తామని కాంగ్రెస్, వామపక్షాలు హామీ ఇచ్చాయి. గందరగోళం మధ్య రాజ్యసభలో బిల్లును ప్రతిపాదించారు.

●2003: ఈ ఏడాది పార్లమెంటులో రెండు సార్లు బిల్లు ప్రవేశపెట్టారు. మార్చిలో అఖిలపక్ష సమావేశం తర్వాత బీజేపీ ప్రతినిధి విజయ్ మల్హోత్రా మాట్లాడుతూ 'ఏకాభిప్రాయం ఉన్నా, లేకున్నా ఈ సమావేశంలోనే బిల్లు ఆమోదం పొందాలని మేం కోరుతున్నాం' అన్నారు.

●2004:యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) ప్రభుత్వం బిల్లును కనీస ఉమ్మడి కార్యక్రమంలో చేర్చింది. 'విధానసభలు, లోక్‌సభలో మహిళలకు మూడింట ఒక వంతు స్థానాలు రిజర్వ్ చేసే బిల్లును ప్రవేశపెట్టేందుకు యూపీఏ ప్రభుత్వం చొరవ తీసుకుంటుంది' అని పేర్కొన్నారు.

●2005: బిల్లుకు పూర్తి మద్దతునిస్తానని బీజేపీ ప్రకటించింది. కులాల ప్రాతిపదికపై కోటాలోనే కోటా ఉండాలని పార్టీలో ఉమాభారతి, ఇతర నాయకులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను బీజేపీ పరిగణనలోకి తీసుకుంది.

●6మే2008: బిల్లును ప్రభుత్వం రాజ్యసభలో ప్రతిపాదించింది. మహిళాబిల్లుపై యాదవులందరూ లాలూప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ (అప్పట్లో యూఎన్‌పీఏలో ఉన్నారు), ఎన్డీఏలోని శరద్‌యాదవ్ ఏకాభిప్రాయంతో ఉన్నారని, అంటే వ్యతిరేకిస్తున్నారని అప్పటి సమాజ్‌వాది పార్టీ నాయకుడు అమర్‌సింగ్ చెప్పారని సమాచారం.

●17 డిసెంబర్ 2009: న్యాయం, చట్టంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బిల్లును ఆమోదించవచ్చని సిఫార్సు చేసింది.

25 ఫిబ్రవరి 2010: కేంద్ర మంత్రివర్గం మహిళాబిల్లుకు ఆమోదముద్ర వేసింది.

8 మార్చి 2010: రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టనీయకుండా ఆర్జేడీ, ఎస్పీ సభ్యులు అడ్డుకున్నారు.

9 మార్చి 2010: మహిళాబిల్లు అత్యధిక మెజారిటీతో రాజ్యసభ ఆమోదం పొందింది.

ఓసారి ఏమైందంటే...

యూపీఏ మొదట అధికారంలోకి వచ్చినప్పుడు మహిళాబిల్లును ప్రవేశపెట్టారు. సమాజ్‌వాది సభ్యుడు అబూ ఆసిం అజ్మీ న్యాయశాఖమంత్రి హెచ్.ఆర్. భరద్వాజ్ చేతిలోంచి కాగితాల్ని లాక్కొని చింపేసేందుకు ప్రయత్నించారు. అప్పుడు కేంద్రమంత్రి రేణుకా చౌదరి సమాజ్‌వాది సభ్యుడిని ఒక్క తోపు తోసి ఆ ప్రయత్నాని విఫలం చేశారు. భరద్వాజ తన స్థానంలో కూర్చొని ఉన్నప్పుడు ఆయనపై ఎలాంటి దాడి జరగకుండా రక్షణగా కొందరు ప్రతిపక్ష మహిళా ఎంపీలు చుట్టూ నిలబడ్డారు.

మహిళా బిల్లుపై

కాంగ్రెస్ నిరంకుశ వైఖరి!

● ముస్లిం మహిళలకు కొంతైనా రిజర్వేషన్ కల్పించాలి
● ఎస్పీ అధ్యక్షుడు ములాయం సింగ్

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లు పట్ల ప్రభుత్వం నిరంకుశ ధోరణి అవలంబిస్తోందని సమాజ్‌వాదిపార్టీ అధ్యక్షుడు ములాయం సింగ్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బిల్లు అమలు కాకుండా తాము అడ్డుకుంటామన్నారు. బిల్లుపై ప్రధానమంత్రి ప్రతిపక్ష నాయకులతో జరిపిన చర్చల వల్ల ఫలితం శూన్యమన్నారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీతో జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి సాధించారని ప్రశ్నించగా 'ఎవరింటారు ఆమె మాటలు' ఏ ఒక్కరూ వినేందుకు ఆసక్తిగా లేర'ని యాదవ్ అన్నారు. ముస్లిం మహిళలకు ఈ బిల్లులో ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పిస్తే, అది ఎంతశాతమైనా తాము తప్పకుండా బిల్లుకు మద్దతిస్తామని యాదవ్ అన్నారు. దేశంలోని 12 రాష్ట్రాలకు కలిపి లోక్‌సభలో ఒక్క ముస్లిం ఎంపీ ఉన్నారు. పురుషుల పరిస్థితే ఇలా ఉంటే మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశమే రాదని ములాయంసింగ్ చెప్పారు. ప్రభుత్వం నిరంకుశంగా మొండిగా ప్రవర్తిస్తోందని. ఈ ప్రభుత్వం గర్వంతో విర్రవీగుతోందని, దీన్ని అంతమొందిస్తామని ములాయం ధ్వజమెత్తారు. ప్రభుత్వం నిరంకుశత్వంతో ఎంపీలను సస్పెండ్ చేసింది. ఒకపక్క టెర్రరిస్టులతో చర్చలకు సిద్ధమంటోంది మరోపక్క ప్రభుత్వ అభిప్రాయంతో విభేదిస్తే వారిని సస్పెండ్ చేస్తోందని ములాయం మండిపడ్డారు. 'యూపీఏ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తూ రాష్ట్రపతికి లేఖ రాస్తారా' అన్న ప్రశ్నను ఆయన దాటవేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులపై కూడా యాదవ్ మండిపడ్డారు. వీరంతా గతంలో తనతో గౌరవంగా మాట్లాడేవారని, ఈ రోజు వారి ప్రవర్తనలో మార్పు స్పష్టంగా కనిపించిందన్నారు. సోనియాగాంధీపై మీరు ఆగ్రహంగా ఉన్నారా అన్న ప్రశ్నకు ఆయన నూటిగా సమాధానం చెప్పలేదు. తానెక్కడైనా ఏ కాంగ్రెస్ నాయకుడి పేరును ప్రస్తావించానా అని ఎదురు ప్రశ్న వేశారు. ప్రభుత్వం మెజారిటీతో నడవదని, ప్రజల నమ్మకంపై నడుస్తుందని అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. ప్రభుత్వానికి మెజారిటీ ఉందని ప్రస్తావించగా, గతంలో కూడా కాంగ్రెస్‌పార్టీకి మెజారిటీ ఉంది. ఎన్నికల్లో ప్రతిపక్షపార్టీలన్నీ ఏకమై కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించాయని ములాయం అన్నారు.

మహిళా బిల్లు ఆమోదం పద్ధతిపై మమత ఆగ్రహం

న్యూఢిల్లీ: మహిళా బిల్లుపై కేంద్రంలోని యూపీఏ భాగస్వాముల మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. మహిళా రిజర్వేషన్ బిల్లుపై తమకు పూర్తి సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టారని తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ప్రధానిపై మండిపడ్డారు. ఎగువసభలో దీనిపై చర్చ జరిగి, ఓటింగ్ జరుగుతున్నా ప్రధానమంత్రి తమకు దీనిపై ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. తమ పార్టీని విశ్వాసంలోకి తీసుకుని మహిళా రిజర్వేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు కూడా ప్రధాని చెప్పలేదని ఆమె అన్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా దీనిపై చర్చ, ఓటింగ్ పెట్టే సరికి తాను తన పార్టీని సమాయత్తం చేయలేకపోయానని మమతా వాపోయారు. సోమవారం నాడు రాజ్యసభలో బిల్లును ఆమోదింపజేసుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన పద్ధతి బాగా లేదని రైల్వేమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు.

బిల్లు అమలుకు సహకరించండి

న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు తెలపాలని సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయంసింగ్‌ను ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎంపీ జయప్రద కోరారు. ఇక్కడ విలేకరులతో ఆమె మాట్లాడుతూ ములాయంసింగ్(నేతాజీ)తో పాటు ఎవరైతే మహిళా బిల్లును వ్యతిరేకిస్తున్నరో అందరూ మద్దతివ్వాలని అభ్యర్థించారు. గతంలో పార్టీ సభ్యురాలిగా ఉన్నందుకు తాను మౌనంగా ఉన్నానని ఆమె వెల్లడించారు. ప్రస్తుతం స్వతంత్రంగా నా అభిప్రాయాలను చెప్పే స్వేచ్ఛ నాకు ఉందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైనప్పుడు మహిళా బిల్లును సమర్థించానని ఆమె పేర్కొ న్నారు. 14 ఏళ్ల తర్వాత బిల్లు అమలు జరిగేందుకు అవకాశం వచ్చిందని ఆమె అన్నారు.

26/11 దాడుల కేసు విచారణ

ముంబయి : 26/11 ఉగ్రవాదుల దాడులకు సంబంధించిన కేసులో విచారణను ఎదుర్కొనేందుకు మహారాష్ట్ర హోం మంత్రి ఆర్ఆర్ పటేల్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి రమేష్ బాగ్వేలు ఇక్కడ ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరయ్యారు.దాడుల్లో పట్టుబడిన పాకిస్తాన్ ఉగ్రవాది అజ్మల్ కసబ్, భారత్‌కు చెందిన ఫహీమ్, సబుద్దిన్ అహ్మద్‌లకు వ్యతిరేకంగా చివరి సారిగా వాదోపవాదాలను వినిపించేందుకు విచారణను ప్రారంభించనున్న సందర్భంగా వీరిరువురు కోర్టుకు హాజరవ్వడం విశేషాన్ని సంతరించుకుంది. మంత్రుల రాక సందర్భంగా కనివిని ఎరుగని రీతిలో భద్రత చర్యలు చేపట్టారు. దాడులలో 166 మందిని చంపినందుకు గాను కసబ్‌పై కేసు నమోదవగా, దాడులకు సంబంధించి రూట్‌మ్యాప్ రూపొందించడం, ఉగ్రవాదులు దాడులకు పాల్పడేలా సహాయం చేయడంలాంటి అభియోగాలపై మిగతా ఇద్దరిపై కేసులు నమోదయ్యాయి.

విదేశీ చట్టసభల్లోనూ మహిళా కోటా

● ప్రపంచదేశాల సరసన భారత్
● 50 దేశాల్లో అమలు

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా 40 దేశాలు తమ దేశంలోని చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కొనసాగిస్తున్నాయి. వాటి సరసన భారత్ కూడా చేరింది. అయితే ఈ దేశాల్లో మహిళలు, పురుషులు అనే తారతమ్యం లేకుండా సమానావకాశాలు కల్పించేందుకు అక్కడి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఉదాహరణకు ఉగాండాలో 56 జిల్లాలకు ఒక పార్లమెంటు సీటును మహిళకు రిజర్వు చేస్తారు. ఆఫ్రికా ఖండంలోని రువాండా (30 శాతం) సుడాన్ 443 సీట్లకు గాను 60 సీట్లు) నైజీరియాలో 10 శాతం. లాటిన్ అమెరికాలోని 14 దేశాల్లో మహిళలకు కోటా పద్ధతి ఉంది. దక్షిణ అమెరికా దేశాల్లో కూడా మహిళలకు కోటా చట్టాన్ని తీసుకువచ్చారు.

యూరప్ విషయానికి వస్తే 8 దేశాల్లో కోటా పద్ధతి కొనసాగుతోంది. స్వీడెన్‌లో జిప్పర్ సిస్టమ్ కొనసాగుతోంది స్త్రీ, పురుషులు చెరి సమానంగా చట్టసభల్లో అడుగుపెడతారు. అర్జెంటినా, బ్రెజిల్‌లో తప్పనిసరిగా మహిళలకు 30 శాతం రిజర్వేషన్ ఉంటుంది. బోలివియా విషయానికి వస్తే ప్రతి మూడు మంది అభ్యర్థులకు గాను ఒక మహిళను ఎన్నుకునే ఏర్పాటు ఉంది.

బీజేపీ, సీపీఎం మహిళా కార్యకర్తల ఆందోళన

పార్లమెంట్ బయట ఆందోళన చేస్తున్న బీజేపీ,సీపీఎం మహిళా కార్యకర్తలు

న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ బీజేపీ, సీపీఎం మహిళా కార్యకర్తలు పార్లమెంట్ వెలుపల ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయాన్నే కొంతమంది బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు విజయ్ చౌక్ సమీపంలోని పార్లమెంట్ గేట్ వద్దకు దూసుకువచ్చి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి వారిని అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం సమయంలో సీపీఎం అనుబంధ ఐద్వా కార్యకర్తలు దగ్గర్లోని రైల్ భవన్ సమీపంలో ధర్నాకు దిగారు. వీరిని కూడా పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మహిళా బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వారిలో ఒకరైన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ మహిళా ఆందోళన కారులను చూపిస్తూ ఎంపీలు సభలోకి రాకుండా వారు కూడా అడ్డుపడుతున్నారు అని వ్యాఖ్యానించారు.

అన్సారీపై దాడిపట్ల ప్రధాని విచారం

న్యూఢిల్లీ : కొందరు ఎస్పీ సభ్యులు రాజ్యసభ ఛైర్మన్ హమీద్ అన్సారీపై దాడి చేయడంపై ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ విచారం వ్యక్తం చేశారు. మహిళా బిల్లును వ్యతిరేకిస్తూ కొంతమంది ఎస్పీ సభ్యులు హమీద్ అన్సారీపై దాడి యత్నించిన విషయం తెలిసిందే. దీంతో అన్సారీని ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఫోన్ ద్వారా పరామర్శించి విచారం వ్యక్తం చేశారని వైస్ ప్రెసిడెంట్ కార్యాలయం వెల్లడించింది. మహిళా బిల్లును వ్యతిరేకిస్తూ ఎస్పీ నాయకులైన నందకిషోర్ యాదవ్, కమల్ అక్తర్‌తో పాటు ఆర్జేడీ గందరగోళం సృష్టించింది. యాదవ్ పోడియం దగ్గరకు దూసుకుని వచ్చి అన్సారీ టేబుల్‌పై ఉన్న కొన్ని పుస్తకాలను, మైక్‌ను తోసేశారు. మరికొంతమంది పోడియం వద్దకు రావడంతో రక్షణ బలగాలు వారిని అదుకున్నాయి.

మహిళా బిల్లు ఉన్నత వర్గాలది

న్యూఢిల్లీ: మహిళా బిల్లు ఉన్నతవర్గాల బిల్లు అని రాజ్యసభ నుండి సస్పెండ్ అయిన సభ్యుడు ఎజాజ్ అలీ ఆరోపించారు. సమాజంలో పేద, అణగారిన మహిళలకు అవకాశం కల్పించాలనేది మా లక్ష్యం, కానీ పార్లమెంటులో ప్రతిపాదించిన బిల్లు అగ్రవర్ణ మహిళలకేనని విమర్శించారు. మహిళా బిల్లులో మార్పులు చేయకుండా ప్రభుత్వం అలాగే ప్రవేశపెడితే, మొదటి రోజు జరిగిందే పునరావృతమవుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టేటప్పుడు అలీ, ఇతర సభ్యులు సభలో గందరగోళం సృష్టించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టేప్పుడు క్రమ రహితంగా వ్యవహరించినందుకు గానూ ఎజాజ్‌ను రాజ్యసభ నుండి సస్పెండ్ చేశారు.

న్యూయార్క్, సింగపూర్‌లలో

'రామాయణ' ఎగ్జిబిషన్‌లు

● పర్యాటకులకోసం ప్రదర్శనలు
● వేదికలుగా పెరనకాన్, మెట్రోపాలిటన్ మ్యూజియాలు

న్యూఢిల్లీ : పురాణ గాథ రామాయణం గురించి తెలుసుకునే వారి సంఖ్య భారత్ సరిహద్దులు దాటి ఇతర దేశాలకు వ్యాపించింది. భారత్‌లో ఎంతో పవిత్రంగా పూజించే రామాయణం కథను తెలుసుకునే అవకాశాన్ని అమెరికా, సింగపూర్ వంటి దేశాలు పర్యాటకులకు కల్పిస్తున్నాయి. 'భారత్ ఇతిహాసం : రామాయణ దృశ్యాలు' పేరిట న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియంలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 19 వరకు జరగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో వివిధ పెయింటింగ్‌లు, శిల్పాలు, గాథను వర్ణిస్తూ దృశ్యాలతో కూడిన కొన్ని వస్త్రాలు ప్రదర్శించనున్నారు. పురాణగాథల గురించి సరిగ్గా తెలియక ఆధునిక జీవనంలో నైతిక విలువల్లో గందరగోళం నెలకొందని, ప్రత్యేకించి రామాయణ కథను వెలుగులోకి తీసుకురావడం ద్వారా ప్రజల సందేహాలను నివృత్తి చేసినట్లవుతుందని ఈ మ్యూజియం అధికారి నవోమి టాకఫుచి తెలిపారు. దీని ద్వారా ఇంకా ప్రాచీన భారతీయ సంప్రదాయం, సంస్కృతి, విలువలు తెలుస్తాయని, ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని ఆయన అన్నారు.

మరోవైపు 'రామాయణ పునఃవీక్షణం : ఒక ప్రేమ, సాహసం కథ' పేరిట మనిషి సృష్టించిన 100 కళాఖండాలను సింగపూర్‌లోని పెరనకాన్ మ్యూజియంలో జనవరి 22 నుంచి ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శన ఆగస్టు 22 వరకు జరగనుంది. వీటిలో నీడ తోలుబొమ్మలాట, పెయింటింగ్‌లు, ప్రాచీన కాలంనాటి దృశ్యాలు ఉంటాయి. విభిన్న సమాజాల్లో అన్ని వయసుల వారిని రామాయణం ఎలా ప్రభావితం చేసింది ఇందులో వివరిస్తారు. ఇక్కడ మరో ప్రత్యేకత ఏమిటంటే తమిళనాడు నుంచి తీసుకువచ్చిన 12వ, 13వ శతాబ్దం మధ్య కాలంనాటి హనుమాన్ విగ్రహం ఉంటుంది. భారత సంప్రదాయాలు, విలువలను తెలియజేసే ప్రాచీన గాథ రామాయణం కళాఖండాలను ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉందని మ్యూజియం డైరెక్టర్ మైఖెల్ కోహ్ చెప్పారు.

రామాయణ గాథను తెలియజేసే రెండు ఎగ్జిబిషన్‌లను నిర్వహించడంపట్ల రామాయణ విద్వాంసుడు ఇందిరా గోస్వామి ఆనందం వ్యక్తం చేశారు. విదేశీయులు రామాయణం గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపడం చాలా గొప్ప విషయమని అన్నారు.

Editor: **N. Surya Prakash Rao**, Printed and Published by him on behalf of SPR PUBLICATIONS (P) LTD, at SPR Printing Press, Surya Soudha, # 8-2-293/ 8 /A, Plot No. 22, Road No. 5, Jubilee Hills, **HYDERABAD** - 500 033 . Phone: 040-2355 6369, 2355 8369. Fax: 040-2360 0024. RNI Registration No. **APTEL/2007/22044**.